# రెయిన్ కోటు

మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తోంది వాన. ఇళ్ళూ, వాకిళ్ళూ, రోడ్లూ, సైడు కాలువలు అన్నీ నీళ్ళతో నిండిపోయి వున్నాయి. వాతావరణం పూర్తిగా చల్లబడిపోయి ప్రతి వస్తువూ ముట్టుకుంటే అయినులా తగులుతోంది.

గుడ్డిలో మెల్లలా జనజీవనం సాగుతూనే వుంది. ఆఫీసులు పనిచేస్తున్నాయి. ఆర్.టి.సి. బస్సులు తిరుగుతూనే వున్నాయి. అందరూ చిరాకు చిరాకుగా అన్ని పనులూ చేసుకుంటూనే వున్నారు.

ఇళ్ళల్లో ఆడవాళ్ళు ఉస్సురుస్సురంటూ బట్టలు పిండుకుంటూ, ఆరేసుకుంటూ, తడిసిపోయిన నేల ఒకటికి పదిసార్లు తుడుచుకుంటూ వంటా వార్పూ చేస్తూనే వున్నారు. పిల్లల్ని స్కూళ్ళకి, భర్తల్ని ఆఫీసులకి పంపిస్తూనే వున్నారు.

తుఫాను వస్తేగానీ వర్షం ఎరుగని విజయవాడలో ఏమిటి చెప్మా యింత వర్షం" అంటూ కొందరూ ఆశ్చర్యపోతూనే వున్నారు.

మొదటి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా వర్షం కురిసినప్పుడు గోపాలం అనుకున్నాడు. ఈసారి ఎలాగైనా రెయిన్‌కోటు కొనుక్కోవాలి. అని అలా అనుకున్న అతని ఆలోచన ఈ నాలుగు రోజులుగా మనస్సులో మర్రిపూడల్లాంటి వేళ్ళతో పాతుకుపోయింది. పైగా అతను ఈ నాలుగు రోజులూ తడిసినంతగా ఎప్పుడూ తడవలేదు. ఇంట్లో ఏం కావాలన్నా అతనే కదా ! తడిసి రావడం, బట్టలు మార్చుకోవడం, తల తుడుచుకోవడం-మళ్ళీ ఏదో పని వచ్చి బయటకెళ్ళడం-, నాని నాని మెత్తపడిపోయాడు. ఎవరేనా "ఏం మొక్క మొలచిపోతావా" అంటే నిజమే మొక్క మొలచిపోతానేమో అనిపిస్తోంది అతనికి.

అందువల్ల అతనికి రెయిన్‌కోటు చాలా అవసరం అని దృఢంగా అనుకున్నాడు గోపాలం. ఈ మాట మనసులో దాచుకోలేక భార్య రాధతో అందామనుకున్నా అనలేదు ఊరుకున్నాడు. ఎందుకంటే ఆమె తేలికగా నవ్వేసి "చాల్లెండి మరీనూ-అక్కడికి మనమేదో చిరపుంజిలో వున్నట్లు" అంటుంది.

అయితే గోపాలం అనుకున్న వెంటనే ఏదీ చేయలేదు. కారణం మరేం లేదు. ఏది కొనాలన్నా డబ్బు కావాలిగా-అదెప్పుడూ అతని దగ్గర వుండదు. ఏది వస్తుందన్నా చాలా ముందుగా ఆ మొత్తం దేనికో ఒక దానికి అత్యవసరంగా కేటాయించబడిపోతోంది.

నాలుగోరోజు కూడా సన్నగా చినుకులు పడుతున్నవేళ - గోపాలానికి ఎప్పటివో అరవై రూపాయలు వచ్చివున్నాయనీ, తీసుకోమని పే ఆఫీసునుండి కబురు రావడంతో ఆనందంతో ఉబ్బితబ్బిబ్బైపోయాడు.

ఎప్పుడో-అయిదేళ్ళ క్రితం అవనిగడ్డలో పనిచేసినప్పుడు ఎక్కువ రికవరీ జరిగింది. సర్కారు వారు దయతలచి వాపసు యిస్తున్నారు. ఇదేనేమో 'ఆకస్మిక ధనలాభం' అంటే అరే- ఈ వర్షంలోపడి తను వారఫలాలు చూడటం మర్చేపోయాడు. పోనీలే చూడకపోవడమే మంచిదైంది. గోపాలం ఆనందం అంతా యింతాకాదు.

సాయంత్రం ఆఫీసు నుంచే సూపర్‌బజారు కెళ్ళి రకరకాల రెయిన్ కోట్లు చూశాడు. నిజంగా అతని దగ్గరున్న డబ్బుకి వచ్చేది చాలా సాదాసీదా రకం. అయినా అతను అసంతృప్తి చెందలేదు. ప్లయిన్ కలర్, ప్లాస్టిక్ రెయిన్‌కోటు అరవై తొమ్మిది రూపాయలకి కొన్నాడు. టోపీ కూడా ముచ్చటగా వుంది.

"నిజమే మరి తనకేదైనా వచ్చిపడిపోతే-కుటుంబం ఏమైపోవాలి? అని తను కోటు కొనడానికి జస్టిఫికేషన్ తనికి తనే చెప్పుకున్నాడు.

అతనింటికి వచ్చేప్పుడు చిన్న తుంపర వస్తూ పోతూ వుంది. ప్యాకెట్ విప్పుదామా అని సంశయిస్తుండగా బస్సు రానే వచ్చింది.

కొత్త ప్యాకెట్ చూసి రాధ ముఖం ఒక్క వెలుగు వెలిగింది.తీరా రెయిన్ కోటు చూసి "ఈ ఆలోచన ఎప్పుడొచ్చిందీ–," అంటూ సాగదీసింది "లేకపోతే ఈ వర్షాలు చూడు" అన్నాడు– ఆమె నవ్వుతూనే "బోలెడు ఖర్చులు, జూన్‌నెల పిల్లల స్కూళ్ళు తెరుస్తారు. మీకిప్పుడెందుకండీ" అంది.

గోపాలం మనస్సు చివుక్కుమన్నా పట్టించుకోలేదు. అదేమిటో అందంగా నవ్వుతూ రాధ ఏమన్నా-గోపాలానికి ఏమి అనుకోవాలనిపించదు.

రాధ వేడిగా చేసిన పకోడీలు ఎంతో బాగున్నాయి. ఆకాశంకేసి చూస్తూ

పకోడీలు తింటుంటే మరీ బాగున్నాయి. ఆకాశంలో మాత్రం ఏనుగుల గుంపుల మేఘాలు పరుగులు పెడ్తూ ఎక్కడికో ప్రయాణం కట్టాయి.

పెళ్ళున ఎండ కాస్తూ భళ్లున తెల్లవారింది. నాలుగు రోజులు శలవు తర్వాత వచ్చిన ఆఫీసరులా సూర్యుడు చిరచిరలాడిపోతున్నారు. అయితే పాపం ఆయన్నెవరూ పట్టించుకోవటం లేదు. సరి కదా పడీ పడీ దణ్ణాలు పెడుతున్నారు. ముసలాళ్లు "నాయనా సూన్నారాయణమ్మూర్తీ అంటూ పదేపదే లెంపలేసుకుంటూనమస్కారాలు చేస్తున్నారు ప్రపంచమంతా (అంటే మన చుట్టూ వున్న బుల్లి ప్రపంచమే సుమండీ) నూతనోత్సాహాలతో ఒళ్ళు విరుచుకుని కదిలింది. ఒక గోపాలం తప్ప అందరూ ఆనందంగా వున్నారు.

ముఖ్యంగా రాధ మూటెడు బట్టలు తడిపేసింది. పెళ్ళున ఎండలో ఎండుతాయి" అంటూ.

గోపాలం ఆఫీసుకు బయలుదేరే సమయానికి సూరీడు వేడి అందుకున్నాడు ఎవరూ చూడకుండా గోపాలం రెయిన్‌కోటు ప్యాకెట్ విప్పి దాన్ని ఆప్యాయంగా చూసుకొన్నాడు.

అంతే, ఆ రోజునుండి ఆకాశంలో మబ్బు తునక కనిపిస్తే ఒట్టు. జూన్ నెల కదా ఎప్పుడెలా వుంటుందోనని రోజూ గోపాలం రెయిన్‌కోటు సంచిలో పెట్టుకుని తీసుకెళ్లుతున్నాడు ఆఫీసుకి. కాని ఒక్క చినుకంటే ఒక్క చినుకు కూడా ముచ్చటకైనా పడలేదు వారం రోజులు ఎండ మాడ్చేసింది. ఒకటి రెండు రోజులు వడగాల్పులు కూడా కొట్టాయి.

"బంగాళాఖాతంలో వాయుగుండం పడితే గానీ వర్షం రాని మన విజయవాడలో రెయిన్ కోటేమిటండీ బాబూ" అంటూ రెండు నిమిషాలు ఆగకుండా పకపకా నవ్వింది రాధ. గోపాలం నీరసంగా తనూ నవ్వి పూరుకున్నాడు. ఆ రోజు సంచీలోంచి రెయిన్‌కోటు తీసిబీరువాలో పడేశాడు.

గోపాలం అరగంటగా చూస్తున్నాడు వర్షం కొంచెం తగ్గితే ఇంటికి బయల్దేరుదామని-, ఆఫీసు కిటికీలోంచి ఆకాశంకేసి, కురిసే వర్షంకేసి చూస్తుంటే— బీరువాలో వెచ్చగా పడుకున్న రెయిన్‌కోటు గుర్తుకొచ్చింది. ఆకాశంలో హరివిల్లులా అతని పెదవులమీద చిరునవ్వు.

— ప్రస్థానం